క్లుప్తంగా

అప్పన్నను దర్శించుకున్న ముత్తంశెట్టి



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న ముత్తంశెట్టి దంపతులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని శనివారం ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆలయం లోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడా మండపంలో ప్రదక్షిణ చేశారు. ఆయన పేరిట అంతరాలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి ప్రసాదాన్ని ఈవో శ్రీనివాసమూర్తి అందజేశారు. వైఎస్సార్‌సీపీ 98వవార్డు ఇన్‌చార్జి ఎర్ర వరహానరసింహం తదితరులు ఎమ్మెల్యే వెంట ఉన్నారు.

కల్వర్టుల మరమ్మతులకు చర్యలు



కాలువను పరిశీలిస్తున్న ముమ్మన దేముడు

పెందుర్తి:తుపాను కారణంగా దెబ్బతిన్న కల్వర్టులు, కాలువల మరమ్మతులకు తక్షణ చర్యలు తీసుకుంటున్నట్లు 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు అన్నారు. వార్డు పరిధిలోని పాపయ్యరాజుపాలెం బీసీ కాలనీలో శనివారం దేముడు పర్యటించారు. తుపాను కారణంగా దెబ్బతిన్న కల్వర్టులు, కాలువలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బందులు లేకుండా తక్షణమే చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. స్థానిక నాయకులు లక్ష్మి, ప్రసన్న, భవనా, సూర్యకుమారి, వరూధిని, నాయుడు, మాధవి, సంగమేశ్వరరావు, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

చేపల మృతికి కారుకులపై చర్యలు తీసుకోవాలి



మృతి చెందిన చేపలతో సీఐటీయూ నాయకుడు గనిశెట్టి, రైతులు

పరవాడ: స్థానిక పెద్ద చెరువులో మత్స్య సంపద చనిపోవడానికి కారణమైన పరిశ్రమల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవడంతో పాటు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సీఐటీయూ అనకాపల్లి జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ కోరారు. పెద్ద చెరువులో చేపలు మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని రైతులు శనివారం చెరువు వద్ద ఆందోళనకు దిగారు. పలు పరిశ్రమల యాజమాన్యాలు విడిచిపెట్టిన విష రసాయనాలు పెద్ద చెరువులో చేరడంతో లక్షల విలువైన చేపలు మృతి చెందాయన్నారు. మత్స్య సంపద మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకొని నష్టపోయిన రైతులకు తగిన విధంగా న్యాయం చేయాలని గనిశెట్టి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు ఆర్.ఆర్. నాయుడు, రైతు సంఘ నాయకులు సిరపరపు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఐక్య పోరాటాలతో విజయం



దీక్షలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: ఉక్కు పరిరక్షణ కోసం కార్మికులు పట్టు వదలక చేస్తున్న పోరాటానికి కేంద్ర ప్రభుత్వం సమాధానమివ్వాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు శనివారం నాటికి 1031వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో సంస్థకు చెందిన ఎస్ఎంఎస్-1 విభాగ కార్మికులు కూర్చున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఐక్య పోరాటాలతో విజయం తథ్యమన్నారు. కార్మికులంతా ఐక్యంగా ఉంటూ ఉద్యమాన్ని ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

పల్లెకు శుద్ధ జలం



నా పేరు కూండ్రపు రత్నకుమారి. పరవాడ మండలం నాయుడుపాలెం శివారు రాముడిగారి దొడ్డి మా గ్రామం. గతంలో తాగునీటి కోసం గ్రామంలో ఏర్పాటు చేసినా వాటర్ ట్యాంకు ప్రజల మంచి నీటి అవసరాలకు సరిపోయేది కాదు. జల్‌జీవన్‌మిషన్ పథకం ద్వారా కొత్తగా ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంకు ద్వారా గ్రామ ప్రజలకు నిరంతరం తాగునీరందుతుంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వేసిన ఇంటింటి కుళాయిల ద్వారా మంచినీటి సమస్యలు తీరాయి. ఇంట్లోనే తాగునీరు అందుబాటులో ఉండడంతో మహిళలకు నీటి కష్టాలు తప్పాయి. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మా నియోజకవర్గం ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్‌కు మా గ్రామ ప్రజల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాం.



జాలరిపేటలో కుళాయిని చెక్ చేస్తున్న అధికారులు



కలపాకలో పైపులు ఏర్పాటు చేస్తున్న దృశ్యం



- జలజీవన్ మిషన్‌లో తాగునీటి పథకాలు, పైపులైన్ల నిర్మాణం
- ఇంటింటి కుళాయిలతో తీరిన గ్రామీణుల అవస్థలు
- 62 గ్రామాల్లో కుళాయి పనులకు రూ.15. 15 కోట్ల వ్యయం



తానాంలో కొత్తగా నిర్మించిన వాటర్ ట్యాంకు

పరవాడ: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత గ్రామీణ ప్రాంత ప్రజలకు తాగునీటి సరఫరాపై దృష్టి సారించింది. జల్‌జీవన్‌మిషన్ పథకం ద్వారా ఇంటింటి కుళాయిలు ఏర్పాటు చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేసింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు కాక ముందు అనేక గ్రామాల ప్రజలు తాగు నీటి కష్టాలు ఎదుర్కొన్నారు. ఆయా గ్రామాల ప్రజలకు జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా తాగునీటిని అందించడానికి సర్కారు చర్యలు చేపట్టింది.

62 గ్రామాల్లో ఇంటింటి కుళాయిలు

కుళాయిలు వేసిన గ్రామాలు	ఖర్చు చేసిన నిధులు		
కట్టవానిపాలెం	రూ.7.50 లక్షలు	బందారుపాలెం	రూ.5 లక్షలు
చీపురుపల్లి	రూ. 42 లక్షలు	గంగునాయుడుపాలెం	రూ. 5 లక్షలు
గొల్లపేట	రూ.11 లక్షలు	హస్తినాపురం	రూ. 1.60 లక్షలు
పోలిరెడ్డిపాలెం	రూ. 13.60 లక్షలు	కొరంగివానిపాలెం	రూ.12 లక్షలు
పందివానిపాలెం	రూ. 26 లక్షలు	రాముడిగారిదొడి	రూ.7 లక్షలు
వెంకటాపురం	రూ. 11 లక్షలు	సిమ్మన్నగారిదొడి	రూ.10 లక్షలు
విస్సన్నపేట	రూ.12.50 లక్షలు	తట్టవానిపాలెం	రూ.5 లక్షలు
డి.గొర్లివానిపాలెం	రూ.19 లక్షలు	పి.బోనంగి	రూ.12 లక్షలు
పి.గొర్లివానిపాలెం	రూ. 5 లక్షలు	నక్కవానిపాలెం	రూ.10 లక్షలు
మరిశవానిపాలెం	రూ.10లక్షలు	విజయరాంపురం	రూ.10 లక్షలు
మూలస్వయంభూవరం	రూ.1లక్ష	చీపుళ్లపాలెం	రూ.1 లక్ష
మామిడివానిపాలెం	రూ.11లక్షలు	గొల్లగుంట	రూ.10 లక్షలు
జాలరిపేట	రూ.20.01లక్షలు	జల్లెలపాలెం	రూ. 5 లక్షలు
ముత్యాలమ్మపాలెం	రూ.31 లక్షలు	శృంగారపాడు	రూ.5 లక్షలు
		తిక్కవానిపాలెం	రూ.36 లక్షలు
		గొల్లలపాలెం	రూ.12 లక్షలు

మండలంలో జల్‌జీవన్ మిషన్ పథకంలో భాగంగా 62 గ్రామాల్లో ఇంటింటి కుళాయిల ఏర్పాటుకు ప్రభుత్వం రూ.15.15 కోట్లు మంజూరు చేసింది. ఇప్పటికే రూ.367.21 లక్షలతో 30 గ్రామాల్లో ఇంటింటి కుళాయిలు ఏర్పాటు చేసి ప్రజలకు తాగునీటి సరఫరా చేస్తున్నారు.

- రూ.568.99 లక్షలతో మరో 12 గ్రామాల్లో జల్‌జీవన్ మిషన్‌లో ఇంటింట కుళాయి నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి.
- మడకపాలెం, వి.ఎల్.ఎన్ పురం గ్రామాల్లో కుళాయిల ఏర్పాటుకు రూ.65.99 లక్షలు మంజూరయ్యాయి. స్థలం సమకూరిన వెంటనే పనులు చేపట్టనున్నారు.
- ఊటగెడ్డపాలెం, స్వయంభూవరం, దలాయిపాలెం, రేఖవానిపాలెం గ్రామాల్లో రూ.93.50 లక్షలు మంజూరయ్యాయి. టెండర్లు ఖరారు కావాల్సి ఉంది.
- బాపడుపాలెంకు రూ.16.08 లక్షలు, కట్టవానిపాలెం రూ.10.96లక్షలు, పందివానిపాలెం రూ.14.08 లక్షలు, వెంకటాపురం రూ.10.96 లక్షలు, విస్సన్నపేట రూ.10.96, చింతలగొర్లివానిపాలెం రూ.16.96 లక్షలు, దిబ్బలగొర్లివానిపాలెం రూ.5.28 లక్షలు, కలపాక రూ.16.96 లక్షలు, మడకపాలెం రూ.5.28 లక్షలు, దిబ్బపాలెం రూ.5.28 లక్షలు, పి.బోనంగి రూ.16.08 లక్షలు, వి.ఎల్.ఎన్.పురం రూ.10.96 లక్షలు, నక్కవానిపాలెం రూ.10.96 లక్షలు,పచ్చికూరవానిపాలెం రూ. 11.68 లక్షలు, విజయరాంపురం రూ.10.96 లక్షలు చొప్పున మంజూరయ్యాయి. టెండర్లు పూర్తికాగానే పనులు చేపట్టనున్నారు.



పి. బోనంగిలో నిర్మించిన వాటర్ ట్యాంకు

మంచినీటి కష్టాలు గట్టెక్కాయి



గతంలో తాగునీటికి నానా అవస్థలు పడేవాళ్లం. ప్రభుత్వం ఇంటింటి కుళాయిలు మంజూరు చేసిన తర్వాత ఆ బాధలు లేకుండా పోయాయి. ఒకే ఒక్క బోర్ వెల్ నుంచి మంచినీరు తెచ్చుకునేవాళ్లం. బోరు ఎండిపోతే దప్పిక తీర్చుకోవడానికి దూరంలోని వాటర్ ప్లాంటుపై ఆధారపడాల్సి వచ్చేది. ఇంటింటి కుళాయిలు వచ్చిన తర్వాత ఆ బాధలు లేకుండా పోయాయి.

– బంధం అప్పలనర్స, గొల్లలపాలెం.

తాగునీటికి ఇబ్బంది పడేవాళ్లం



గ్రామంలో ఉన్న మంచినీటి పథకం నుంచి గ్రామస్తులు తాగునీటి అవసరాలకు సరిపోయేది కాదు. నిర్ణీత సమయంలో సరఫరా నిలిపివేసేవారు. చాలా ఇబ్బంది పడేవాళ్లం. దప్పిక తీర్చుకోవాలంటే ఆర్వో ప్లాంట్లపై ఆధారపడేవాళ్లం. ప్రస్తుతం జగనన్న ప్రభుత్వం మంజూరు చేసిన ఇంటింటి కుళాయిల వలన తాగునీటి కష్టాలు తీరాయి. కుళాయిలు బాగా పనిచేస్తున్నాయి. జగనన్నకు కృతజ్ఞతలు.

–గండి సంతోషి, వాడచీపురుపల్లి

30 గ్రామాల్లో ఇంటింటి కుళాయిలు



మండలంలో 30 గ్రామాల ప్రజలకు ఇంటింటి కుళాయిల ద్వారా సురక్షిత నీరు అందిస్తున్నాం. మరో 12 గ్రామాల్లో ఇంటింటి కుళాయి నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. మండల ప్రజలకు తాగునీటి కష్టాలు తీర్చడానికి 22 గ్రామాల్లో ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది.

–షన్ముఖ, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్.

వైభవంగా అప్పన్నకు ఆర్జిత సేవలు



స్వామికి స్వర్ణతులసీ దళాలతో పూజ చేస్తున్న అర్చకుడు



స్వర్ణ తులసీ దళాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు,సిబ్బంది

సింహాచలం: ఏకాదశిని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం ఆర్జితసేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7గంటల నుంచి స్వర్ణతులసీదళార్చన ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణమండపం లోని వేదికపై అధిష్ఠింపజేశారు. ఉభయదాతలను స్వర్ణ తులసీదళాలతో ప్రదక్షిణ చేయించారు. అష్టోత్తర శతనామావళిపూజ నిర్వహిస్తూ 108 స్వర్ణతులసీ దళాలతో అర్చన చేశారు. ఆలయ సూపరింటెండెంట్ వెంకటరమణ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

విశేషంగా నిత్య కల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.



నిత్యకల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలు

17 నుంచి ధనుర్మాసోత్సవాలు ప్రారంభం

పెందుర్తి: వెంకటాద్రిపై వెలసిన వేంకటేశ్వరస్వామికి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి సీతారామాచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు జరిపారు. మధ్యాహ్నం ఆలయంలో నిర్వహించిన భారీ అన్న సమారాధన నిర్వహించారు.. వేలాది మంది భక్తులు స్వామివారిని –వెంకటాద్రిపై ఈ నెల 17 నుంచి ధనుర్మాసోత్సవాలు ప్రారంభం కానున్నట్లు అర్చకుడు రామానుజాచార్యులు తెలిపారు. జనవరి 14తో ముగియనున్న ఉత్సవాల్లో ప్రతీ రోజూ ప్రత్యేక కార్యక్రమాలు జరుగుతాయని చెప్పారు. ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను శ్రీవారి సన్నిధిలో ఆవిష్కరించారు.



ధనుర్మాసోత్సవాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న అర్చకులు, ఆలయ కమిటీ ప్రతినిధులు

కేసుల పరిష్కారానికి రాజీ మార్గం ఉత్తమం

- 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి షణ్ముఖరావు
- లోక్ అదాలత్‌లో 181 కేసుల పరిష్కారం



లోక్ అదాలత్ శిబిరంలో ప్రసంగిస్తున్న న్యాయమూర్తి షణ్ముఖరావు

గాజువాక : కోర్టు కేసులను పరిష్కరించుకోవడానికి రాజీమార్గం ఎంతో ఉత్తమమని 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి షణ్ముఖరావు అన్నారు. గాజువాక కోర్టు కాంప్లెక్స్‌లో శనివారం నిర్వహించిన జాతీయ మెగా లోక్ అదాలత్ శిబిరంలో ఆయన ప్రసంగించారు. రాజీ మార్గంలో కేసులను పరిష్కరించుకోవడం ద్వారా కక్షిదారులకు సమయం, ధనం వృథా కాకుండా ఉంటాయన్నారు. కక్షిదారుల మధ్య సంబంధాలు బలపడతాయన్నారు. గాజువాకలోని వివిధ కోర్టుల్లో గల 181 కేసులను ఈ శిబిరంలో రాజీమార్గం ద్వారా పరిష్కరించినట్లు కోర్టువర్గాలు తెలిపాయి. పరిష్కారమైన కేసుల విలువ రూ.3.79 కోట్లని పేర్కొన్నాయి. న్యాయమూర్తులు ఇ.రాజేంద్రబాబు, వి.పల్లవి, వై.శ్రీలక్ష్మి, వై.ప్రేమలత, గాజువాక బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు కె.వి.స్వామి, బి.వి.ఎం.కృష్ణ పాల్గొన్నారు.

మన రాజ్యాంగం ప్రపంచానికి మార్గదర్శకం



మాట్లాడుతున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

సీతమ్మధార: డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ రచించిన భారత రాజ్యాంగం ప్రపంచ దేశాలకు మార్గదర్శకమని విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ పేర్కొన్నారు. బుల్లయ్య కళాశాల రోడ్డులోని అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ 40 వసంతాల(రూబి జూబ్లీ) వేడుకల్లో భాగంగా శనివారం అంబేడ్కర్ భవన్‌లో సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ నిరుపేద కుటుంబంలో పుట్టి మారుమూల గ్రామం నుంచి ప్రపంచ స్థాయి మేధావిగా ఎదిగిన అంబేడ్కర్ జీవితం నేటితరానికి స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దళిత పక్షపాతి అని, ఎస్సీ, ఎస్టీలపై ఎంతో ఆదరణ చూపిస్తూ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. అంబేడ్కర్ భవన్ అభివృద్ధికి ఎంపీ కోటా నుంచి రూ.25 లక్షలు కేటాయించినట్లు చెప్పారు. అవసరమైన మేరకు నిధులు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు గడుస్తున్నా దళితుల స్థితిగతుల్లో మార్పు రాలేదన్నారు. రాజ్యాంగ హక్కులు పొందేందుకు అందరూ సమష్టిగా పోరాడాలని పిలుపునిచ్చారు. సొసైటీ ప్రధాన కార్యదర్శి జేవీ ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ అధ్యక్షుడు బొడ్డు కల్యాణ్‌రావు, కేజీహెచ్ సూపరింటెండెంట్ పి.అశోక్‌కుమార్, డాక్టర్ అర్జున్, కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ, మైనార్టీ సంఘం నాయకులు ఐఎం అహ్మద్ పాల్గొన్నారు.

ఇద్దరికి రిమాండ్

ఆరిలోవ: గుట్టుగా గంజాయి తరలిస్తున్న ఇద్దరు యువకులను ఆరిలోవ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. వారు తెలిపిన వివరాలిలా.. కర్ణాటక రాష్ట్రం గూగ్లికి చెందిన బనవర్ మురళీ కృష్ణ, తెలంగాణ రాష్ట్రం సూర్యాపేటకు చెందిన బండి రాహుల్ హైదరాబాద్ రైల్వే స్టేషన్‌లో బర్గర్ కేఫ్‌లో పనిచేసేవారు. ఇటీవల వారిరువురు పనిమానేశారు. అక్కడ నుంచి నాలుగు రోజుల కిందట అరకు చేరుకున్నారు. అక్కడ ఓ వ్యక్తితో పరిచయం పెంచుకొని అతని వద్ద 5 కిలోల గంజాయి కొనుగోలు చేశారు. దానిని తీసుకొని విశాఖ చేరుకున్న ఆ యువకులను టాస్క్‌ఫోర్స్ పోలీసులు, ఆరిలోవ పోలీసులు కలిసి హనుమంతవాక వద్ద శనివారం పట్టుకున్నారు. వారి నుంచి 5 కిలోల గంజాయి స్వాధీనం చేసుకొని కోర్టులో హాజరుపరిచారు. వారికి కోర్టు రిమాండ్ విధించినట్లు ఆరిలోవ సీఐ సోమశేఖర్ తెలిపారు.

యదువంశీ అపార్ట్‌మెంట్ బిల్డర్ మోసం

- ఎమినిటీస్‌పై రుణం తీసుకుని బకాయిలు కట్టలేదు
- ఆందోళన వెలిబుచ్చిన ఫ్లాట్ల ఓనర్లు



పెందుర్తి : యదువంశీ అపార్ట్‌మెంట్ అయతనం బిల్డర్ మొగ్గా సీతారామయ్య తమను దారుణంగా మోసం చేసి తమకు చెందిన అపార్ట్‌మెంట్ ఎమినిటీస్‌పై రుణాలు తీసుకున్నాడని అపార్ట్‌మెంట్ వాసులు ఆందోళన వెలిబుచ్చారు. ఆయా రుణాలు చెల్లించక పోవడంతో కల్యాణ మండపం, పార్కు స్థలం, ఇతర భవనాల స్వాధీనానికి బ్యాంక్ నుంచి నోటీసులు వచ్చాయని చెప్పారు. శనివారం రాత్రి ఈ ఘటనపై దాదాపు 250 మంది అపార్ట్‌మెంట్ వాసులు అత్యవసరంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అపార్ట్‌మెంట్ ప్రతినిధులు మాట్లాడుతూ మొగ్గా సీతారామయ్య అనే బిల్డర్ యదువంశీ అయతనం పేరుతో అపార్ట్‌మెంట్‌లు నిర్మించి తమకు అమ్మకాలు చేశారన్నారు. అపార్ట్‌మెంట్ ఫ్లాట్ల కొనుగోలు సమయంలో ఏసీ ఫంక్షన్ హాల్, డిపార్ట్‌మెంటల్ స్టోర్స్, పార్కు, లేడీస్ రిక్రియేషన్ క్లబ్‌తో పాటు ఇతర వసతులు కల్పిస్తామని చెప్పారన్నారు. అయితే ఆయా ఎమినిటీస్‌పై కొన్నాళ్ల కిందట తమకు తెలియకుండా లోన్ తీసుకున్నారని.. ఆ రుణాన్ని తిరిగి చెల్లించకపోవడంతో అడ్వకేట్ కమిషనర్ ద్వారా ఆయా ఆస్తులకు జప్తు నోటీసులు వచ్చాయన్నారు. తమ అపార్ట్‌మెంట్‌లకు చెందిన ఆస్తులను బిల్డర్ ఈ విధంగా మోసపూరితంగా ఆర్థిక లావాదేవీలు చేయడం దారుణమన్నారు. దీనిపై అపార్ట్‌మెంట్ వాసులంతా సమాలోచనలను చేసి తదుపరి కార్యాచరణ రూపొందిస్తామని చెప్పారు.



అత్యవసరంగా సమావేశమైన యదువంశీ అయతనం అపార్ట్‌మెంట్స్ వాసులు

ఆ ఆస్తులు నావి: మొగ్గా సీతారామయ్య, బిల్డర్

పెందుర్తిలోని యదువంశీ అపార్ట్‌మెంట్‌లు గేటెడ్ కమ్యూనిటీ కాదని, అందులోని ఎమినిటీస్ మొత్తం తనకు చెందినవి మాత్రమే అని బిల్డర్ మొగ్గా సీతారామయ్య చెబుతున్నారు. ఫంక్షన్‌హాల్, ఇతర ప్రజోపయోగకార ఆస్తులు అపార్ట్‌మెంట్‌వాసులకు తక్కువ ధరకు అద్దెకు ఇవ్వడమే తప్ప వారికి దీనిపై ఎలాంటి హక్కులు లేవన్నారు. బ్యాంక్ రుణం తాను చెల్లించకపోతే తనకు చెందిన ఆస్తులు పోతాయి తప్ప అపార్ట్‌మెంట్ వాసులకు ఎలాంటి నష్టం జరగదని చెబుతున్నారు. ఇప్పటికీ ఫంక్షన్ హాల్ నిర్వహణ బాధ్యతలు తనవే అని పేర్కొన్నారు.